అనునిత్యం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 04 జూన్ 2023

హరీశ్‌రావు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-లింగంపేట్

ఆర్థిక శాఖ మాత్యులు తన్నీరు హరీష్ రావు పుట్టినరోజు వేడుకలను కామరెడ్డి జిల్లాఉపాధి హామీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం లింగంపేట్ మండల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ హరీష్ రావు ఉపాధి హామీ ఉద్యోగులపై కూడా చల్లని చూపు ఉండాలని ఉపాధి హామీ ఉద్యోగులకు పే స్కేల్ ఇవ్వాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు రాజు ,వినోద్, మనోహర్, వంశీకృష్ణ గౌడ్, దుర్గా గౌడ్ , ప్రదీపదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్‌లో బడిబాట

నవతెలంగాణ-లింగంపేట్

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా లింగంపేట మండలంలోని లింగంపేట్ ఎల్లమ్మ తండాలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా అంగన్వాడి కేంద్రం లోని వివరాలను తీసుకొని ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతిలో నమోదు పిల్లల వివరాలను సేకరించారు. అంగన్వాడి కేంద్రంలో ఒకటో తరగతిలో నమోదు కావాల్సిన విద్యార్థుల సంఖ్య ముగ్గురు ఉన్నారని అంగన్వాడి కేంద్రం టీచర్ మంజుల తెలిపారు. ఈరోజు స్థానికంగా ఉన్నటువంటి ఎల్లమ్మ తండ ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతిలో ప్రవళికను జాయిన్ చేసుకొని ఐ ఎస్ ఎం ఎస్ ఆన్లైన్ పోర్టల్ పొందుపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సిద్ధికి. వనజ, సిఆర్పిలు గంగాధర్ సంజీవ్, విజయ్ కుమార్ అంగన్వాడి కార్యకర్త మంజుల పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ జరిగేనా?

- స్కూళ్లలో పేరెంట్స్ కమిటీ ఉత్తమాటే
- ఇష్టారీతిన ఫీజుల పెంపు
- ప్రయివేటు టీచర్ల నెత్తిన అడ్మిషన్ల టార్గెట్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



నూతన విద్యాసంవత్సరానికి సమయం సమీపిస్తున్న కొద్దీ.. తల్లిదండ్రుల్లో ఫీజుల ఆందోళన మొదలవుతోంది. అడ్మిషన్ ఫీజు నుంచి మొదలు స్కూల్ ఫీజు, యూనిఫామ్స్, పుస్తకాలకు వేల నుంచి లక్షల రూపాయాలు వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రతియేటా స్కూళ్ల ఆరంభంలో కొద్ది రోజులు ఫీజులు పెంచితే చర్యలు అంటూ ప్రకటనలు ఇస్తున్న విద్యాశాఖ అధికారులు.. అందుకు తగ్గట్టుగా చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా ప్రతియేటా ఫీజుల భారంతో తల్లిదండ్రులు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇక ఈ మధ్య కాలంలో స్కూళ్ల పేరు చివరిలో తోక పేర్లు జత చేసి లక్షల రూపాయాలు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫీజు నియంత్రణకు సంబంధించి ప్రతి పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ఆమోదం తరువాతే ఫీజులు పెంచాలని విద్యాశాఖ నిబంధనలు చెబుతున్నప్పటికీ.. ఆచరణ జరగడం లేదు.

నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలలు 460-500 వరకు ఉన్నాయి. ప్రయివేటు స్కూళ్లలో ఫీజుల నిర్ణయానికి సంబంధించి పేరెంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలి. ఈ పేరెంట్స్ కమిటీ సలహాలు, సూచనలు యజమాన్యాలు స్వీకరించాలి. ఈ కమిటీ ఆమోదం ఉంటేనే ఫీజులు పెంచాలి. కానీ జిల్లాలో ఏ ఒక్క పాఠశాలలోనూ ఈ నిబంధన అమలు చేయడం లేదు. ప్రతియేటా 20 నుంచి 30 శాతం ఫీజులు పెంచేస్తున్నారు. ఇక స్మార్ట్, టెక్నో అంటూ ప్రతి విద్యాసంవత్సరం లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇక ఫీజులకు సంబంధించి ప్రతి పాఠశాలలో నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలి. ఏ తరగతికి ఎంత ఫీజు అనే విషయాన్ని స్పష్టంగా విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిసేలా బోర్డు అతికించాలి. కానీ దీన్ని కూడా పలు యజమాన్యాలు పట్టించుకోవడం లేదు. అడ్మిషన్ ఫీజు తీసుకోవద్దని ఆదేశాలున్నప్పటికీ.. అడ్మిషన్ల పేరిట ఒక్కో విద్యార్థి నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో నర్సరీ విద్యార్థికి కనిష్టంగా రూ.20 వేల నుంచి గరిష్టంగా రూ.40 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక తరగతి పెరిగినా కొద్దీ ఫీజు పెరుగుతోంది. ఇక స్కూల్ యజమాన్యాలు ప్రతియేటా పుస్తకాలు మార్చుతూ తప్పనిసరిగా కొనే పరిస్థితి కల్పిస్తున్నారు. సాధారణంగా గతంలో ఒక తరగతికి చెందిన పాఠ్యాంశాలు ఎప్పుడో కానీ మారేవి కావు. దీనివల్ల మధ్యతరగతి కుటుంబంలోని పిల్లలు తమ సోదరుల పుస్తకాలను తీసుకుని చదువుకునే వారు. కానీ ప్రస్తుతం ఆ సౌకర్యం లేకుండా విధిగా పుస్తకాలు కొనే విధంగా ప్రతిసంవత్సరం ప్రతి తరగతికి పుస్తకాలు మారుస్తున్నారు. ఇక యజమాన్యాలు పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నప్పటికీ.. పట్టించుకోవడం లేదు.

టీచర్లపై అడ్మిషన్ల భారం..

తరగతి గదుల్లో పాఠ్యాంశాలు బోధించాల్సిన టీచర్లు.. ప్రస్తుతం అడ్మిషన్ల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయివేటు యజమాన్యాలు అడ్మిషన్ల కోసం టీచర్లను ఇంటింటికి ప్రచారం కోసం పంపుతున్నారు. లేకపోతే ఉద్యోగంలో నుంచి ఊడదీస్తామని బెదిరిస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో టీచర్లు ఇంటింటి ప్రచారం చేయాల్సి వస్తోంది.

ఆరంభంలోనే హడావుడి..

ఫీజుల పెంపుదలపై కఠినంగా వ్యవహరించాల్సిన విద్యాశాఖ అధికారులు.. ఆరంభంలో హడావుడి చేసి ఆపై పట్టించుకోవడం లేదు. ఫీజుల పెంపుదల, పుస్తకాల అమ్మకంపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ వైపు చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం అధికమవుతోంది.

ఫీజుల భారం తగ్గించాలి
స్వామి, చంద్రబాబునగర్ కాలనీ



స్కూళ్లు ప్రారంభమవుతు న్నాయంటేనే ఫీజుల భారంతో భయమవుతోంది. ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే స్కూల్ ఫీజుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. చాలీచాలని జీతాలతో ఫీజుల భారమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు పెంచకుండా చర్యలు తీసుకోవాలి.

విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి
బోడ అనిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



ఫీజుల నియంత్రణపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రతియేటా ఫీజుల భారం తగ్గించాలని విద్యార్థుల తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రయివేటు యజమాన్యాలు ఇష్టారీతిన ఫీజులు పెంచుతూ భారం మోపుతున్నాయి. తోక పేర్లు జత చేసి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయి.



సమావేశంలో ప్రశ్నిస్తున్న రైతులు

వేడుకల్లో రైతుల ఆగ్రహం

- అక్రమ ఇసుక రవాణాకు ఉంటయ్.. ధాన్యం తరలించేందుకు లారీలు ఉండవా..?
- రైతు పెన్షన్ అమలు చేయాలి
- పెద్దతడగూర్ క్లస్టర్‌లో రైతుల డిమాండ్

నవతెలంగాణ-మద్నూర్

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు వేదికలో నిర్వహించిన రైతు దినోత్సవంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా ఇసుక తరలించేందుకు లారీలు ఉంటాయి కానీ.. రైతుల ధాన్యం తరలించేందుకు మాత్రం అధికారులకు లారీలు దొరకడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్నూర్ మండలంలోని పెద్ద తడగూర్ రైతు వేదికలో నిర్వహించిన రైతు దినోత్సవం కార్యక్రమంలో పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 ఎకరాల భూమి ఉన్న రైతులకు రైతుబంధు రావడం లేదని అన్నారు. రైతు బంధు, బీమాతో పాటు రైతు పెన్షన్ అమలు చేయాలని ఆదుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ రంగ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని రైతు బంధు రైతు బీమా పథకాలు రైతులకు ఎంతో సహాయం పడుతున్నాయని తెలిపారు. రైతుల ఆవేశాన్ని అర్థం చేసుకుంటామని రైతులకు ప్రత్యేకంగా ఆదుకోవడానికి ప్రభుత్వం రాబోయే కాలంలో పకడ్బందీ చర్యలు తీసుకోబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ రంగ ఆత్మ కమిటీ చైర్మన్ కొండ గంగాధర్, ఆ గ్రామ సర్పంచ్ మొగలాజి, ఎంపీటీసీ ముక్తాబాయి, రైతు కన్వీనర్ జక్కు గంగాధర్, ఏఈఓ సతీష్, గ్రామ కార్యదర్శి చిన్న, ఎక్లారా గ్రామ సర్పంచ్ భీమ్రావు, ఆయా గ్రామాల వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక పరిస్థితులతో ప్రేమ జంట ఆత్మహత్య

వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ-పిట్లం

వారు ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఇరు కుటుంబీకులు ఒప్పుకోకున్నా పెండ్లి చేసుకున్నారు. ఎన్నో ఆశలతో తమ దాంపత్య జీవితం ప్రారంభించిన జంట.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బొల్లక్‌పల్లి గ్రామాల్లో శనివారం చోటుచేసుకుంది.

దేవక్కపేట్‌లో జీపీ స్థలంపై రగడ

- ఇరు వర్గాల మధ్య ఘర్షణ.. స్టేషన్‌లో ఫిర్యాదు



రాస్తారోకో చేపట్టిన పలువురు

నవతెలంగాణ-భీంగల్

మండలంలో దేవక్కపేట్ గ్రామపంచాయతీని ఆనుకొని ఉన్న పాత గ్రామపంచాయతీ స్థలాన్ని గ్రామానికి చెందిన ఎస్టీ వర్గీయులు కబ్జా చేస్తున్నారని వాటిని రక్షించాలని బీసీ, ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో పట్టణ కేంద్రానికి తరలివచ్చి శనివారం ధర్నా చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఏళ్ల తరబడి ఉన్న పాత గ్రామపంచాయతీ స్థలాన్ని గ్రామానికి చెందిన ఎస్టీ వర్గీయుడు కబ్జాచేసి అట్టి స్థలంలో నిర్మాణాలు చేపట్టడంతో అడ్డుకోబోయిన తమపై దాడి చేశారని కనుక అట్టి వారిపై చర్యలు తీసుకోవాలని అలాగే గ్రామపంచాయతీ స్థలాన్ని కాపాడాలని వారు పోలీసులను కోరారు.

ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి పని ప్రదేశంలో మాట్లాడుతున్న ఏశాల గంగాధర్

నవతెలంగాణ-బోధన్

ఉపాధిహామీ కూలీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఊట్ పల్లి, బెల్లాల్ గ్రామ శివారులో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్ర రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ఉపాధి హామీ వ్యతిరేక విధానానికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో జూన్ 5వ తేదీన ఆరు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ల ఆఫీసుల వద్ద ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధి కూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు నిజామాబాద్ నూతన కలెక్టర్ కార్యాలయం వద్ద తరలిరావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఉపాధి హామీకి రెండు లక్షల 62 కోట్లు కేటాయించాలని, రోజుకు 600 రూపాయల కూలి ఇవ్వాలని, సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం ఐదు లక్షలు అందించాలని, ప్రతి ఒక్క వ్యక్తికి ఒక జాబ్ కార్డు కేటాయించాలని, పెండింగ్లో ఉన్న బకాయి బిల్లులు చెల్లించాలని, ఉపాధి హామీ కూలీలకు గడ్డపార, పలుగులు, పారలు ఇవ్వాలని, పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం, ఓఆర్ఎస్ పాకెట్లు ఇవ్వాలని, పని ప్రదేశంలో ఆయాల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే కాలంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దండు సాయిలు, దాసారం ప్రకాష్, పూర్లే తిప్పమ్మ, లక్ష్మి, పద్మ, దండ సావిత్రి, సుంకర లక్ష్మి, దండు రాణి, ముత్తన్న, హైమద్ బేగం, పాషా భాయ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై దురుసు వైఖరి సరికాదు

- భూపోరాట పేదలపై అధికారుల వైఖరిని ఖండించిన సీపీఐ(ఎం)
- భయబ్రాంతులకు గురిచేస్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరిక

నవతెలంగాణ-కంఠేశ్వర్



భూపోరాట కేంద్రం వద్ద మాట్లాడుతున్న రమేశ్ బాబు..



పేదలను భయబ్రాంతులకు గురి చేస్తున్న పోలీసులు

పేద ప్రజల పట్ల అధికారుల దురుసు వైఖరిని మానుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. పది రోజులుగా నిరుపేద ప్రజలు స్థలాలు కొరకు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని భూ పోరాటం నిర్వహిస్తున్న పేదల వద్దకు శనివారం రెవిన్యూ అధికారులు, పోలీస్ అధికారులు వచ్చి బెదిరింపులకు పాల్పడుతు చట్ట వ్యతిరేకంగా గుడిసెలు వేస్తున్నారని గుడిసెలు తొలగించని యెడల పేదల పైన కేసులు నమోదు చేయాల్సి వస్తుందని భయబ్రాంతులకు గురి చేయటం సరైంది ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా నివసిస్తున్న నిరుపేదలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కానీ ఇండ్ల స్థలాలు కానీ ఇవ్వకుండా అధికారుల చుట్టూ ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోకపోవడంతో నిర్లక్ష్యంగా విస్మరించటం వలన ప్రజలు విసిగి వేసారి గత్యంతరం లేక ఇంటి యజమానుల కిరాయిలను భరించలేక గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తామని ప్రకటిస్తున్నప్పటికీ వేసుకున్న గుడిసెలను తొలగించాలని అధికారులు పేదల పట్ల దురుసుగా వివరించటం బాధ్యతరహితమని ప్రజలను ఆదుకోవలసిన ప్రభుత్వమే ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించటం సరైంది కాదని అన్నారు. నగరంలో అనేకమంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించి లక్షలాది రూపాయలను కూడా పెట్టుకున్నారని, వారి పట్ల చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు పేదల పట్ల మాత్రం ఒంటి కాలిపై రావటం ప్రజల పట్ల ప్రభుత్వం ప్రజల పట్ల తమ వైఖరిని చేస్తుందని వారు అన్నారు. ఇండ్ల స్థలాలు సాధించే వరకు ప్రజలు భూపోరాటాన్ని కొనసాగిస్తారని అధికారుల బెదిరింపులకు లొంగే పరిస్థితి లేదని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్‌బాబు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సుజాత, రాములు నగర కమిటీ సభ్యులు కృష్ణ, అనసూయమ్మ, కళావతి తదితరులతోపాటు వందలాది మంది నిరుపేదలు పాల్గొన్నారు.

రియల్ఎస్టేట్ వ్యాపారులకు వత్తాసు

నగరంలోని రూరల్ పోలీసులు అధికారులు నిజా నిజాలు తెలుసుకొని స్థలాల వద్దకు రావాలని భూ పోరాటం చేస్తున్న వారిని భయబ్రాంతులకు గురి చేయడం తీవ్రంగా ఖండిస్తున్నానని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్ అన్నారు. నిజామాబాద్ నగరంలోని దుబ్బా ప్రాంతంలో సిపిఎం ఆధ్వర్యంలో భూ పోరాటం చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. భూ పోరాట కేంద్రం వద్దకు పోలీసులు వచ్చి, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వత్తాసు పలికే పద్ధతుల్లో వ్యవహరిస్తూ, గుడిసెలు వేసుకున్న ప్రజలను భయాందోళనలకు గురి చేస్తూ, గుడిసెలు ఖాళీ చేయాలని రూరల్ ఎస్హెచ్ఓ వ్యవహరించడం సరికాదని అన్నారు. అధికారులు నిజానిజాలు తెలుసుకొని రావాలని అని, భయబ్రాంతులకు గురి చేస్తే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కేసుల విచారణలో లోపాలు ఉండొద్దు

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కుంచాల సునీత

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఎల్లారెడ్డి

పిల్లలపై జరిగిన లైంగిక వేధింపులు, దాడుల కేసులలో నేర విచారణ ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. ఫోక్సో కేసు విచారణలో లోపాలు ఉండొద్దని చెప్పారు. జిల్లాకోర్టు ప్రాంగణం లోని న్యాయసేవ సదన్‌లో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ నిర్వహించిన సదస్సులో ఆమె పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. అభంశుభం తెలియని పిల్లల వయసు, మానసిక పరిస్థితి, సామాజిక స్థితిని పరిగణలోకి తీసుకుని వారి స్టేట్ మెంట్ ను మహిళా విచారణ అధికారులు రికార్డు చేయాలని సూచిం చారు. నేర విచారణ నిర్వహిం చే సమయాలలో నేరం జరిగిన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, నేర స్థలాన్ని పరిశీలించే సందర్భంలో నేరం జరిగిన తీరు, స్థలం, సమయం ఒక క్రమ పద్ధతిలో నమోదు చేసుకో వాలని ఆమె వివరించారు. పిల్లల స్టేట్ మెంటుతో పాటు వారి తల్లి దండ్రులు, ప్రత్యక్ష సాక్షుల స్టేట్ మెంట్స్ కీలకమని, స్టేట్‌మెంట్స్‌ను చాలా జాగ్రత్తగా నమోదు చేయాలని ఉద్బోధించారు. నేరం జరిగిన తరువాత ఫిర్యాదు స్వీకరించిన వెంటనే నమోదు చేసి ప్రాథమిక విచారణ నివేదిక నుండి నేర విచారణ పూర్తి చేసుకున్న తర్వాత కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేసే వరకు అనుసరించాల్సి విధివిధానాలు జిల్లాజడ్జి సునీత తెలిపారు. సాక్ష్యాలు సేకరించే క్రమంలో నిర్లక్ష్యానికి తావు నివ్వరాదని తెలిపారు.

నిజామాబాద్ అదనపు జిల్లాజడ్జి కనకదుర్గ ప్రసంగిస్తు పిల్లల వాంగ్మూలాలు వారి భాషలోనే నమోదు చేయాలని అన్నారు. నేర విచారణ పోలీసు అధికారులు తమ స్వంత భాషను పిల్లలపై ప్రయోగించారాదని తెలిపారు. లైంగిక వేధింపులు, దాడులు అనే పద ప్రయోగాలు జాగ్రత్తగా వాడుకుని బాధితుల, ఇతర సాక్షుల వాంగ్మూలాలో నిక్షిప్తం చేయాలని అన్నారు. సదస్సులో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, జూనియర్ సివిల్ జడ్జిలు కుష్బు,గోపికృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహ్మద్ రహిమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని మున్సిఫ్ కోర్ట్ లో న్యాయ సేవా సదన్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరయ్య శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎఫ్ఐఆర్ నుండి చార్జి షీట్ లో జరుగుతున్న లోపాలను నివారించి కేసులలో నేరస్తులను శిక్షలు పడేటట్లు చర్యలు తీసుకోవాలని గోప్యంగా వ్యవహరించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ అన్నారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్, ఎల్లారెడ్డి ఎస్ఐ గణేష్, నాగిరెడ్డిపేట్ ఎస్ఐ ఆంజనేయులు, గాంధారి ఎస్ఐ వి సుధాకర్, లింగంపేట్ ఎస్ఐ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికకు తాళం

బిల్లులు రాకపోవడంతో పనులు చేపట్టిన సర్పంచ్ నిరసన



తాళం వేసిన కాంట్రాక్ట్ పనులు చేపట్టిన సర్పంచ్

నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు రైతు దినోత్సవ సంబరాలను రైతు వేదికలలో జరిపేందుకు వెళ్లగా రైతు వేదిక నిర్మాణ డబ్బులు పూర్తిగా రాలేదని నాళేశ్వర్‌లో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కం సర్పంచ్ తాళం వేసి శనివారం నిరసన తెలిపారు. రైతు వేదిక నిర్మించి మూడేళ్లు అవుతున్న 22 లక్షల బిల్లులో సుమారు నాలుగు లక్షల వరకు బిల్లు పెండింగ్ లో ఉందని బిల్లులు చెల్లించకుండానే రైతు వేదికలో సంబరాలు ఎలా జరుపుకుంటారని తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి సురేష్ గౌడ్ ఎంపీడీవో సాజిద్ అలీతో ఫోన్లో మాట్లాడగా త్వరలోనే పూర్తి బిల్లు మంజూరు అయ్యేవిధంగా చూస్తానని హామీ ఇవ్వడంతో తాళం తీసి రైతు దినోత్సవాన్ని జరుపుకున్నారు.

ధాన్యం నిలిచింది.. డబ్బులు రావట్లే

కాగా నాళేశ్వర్ , తుంగిని రైతులు తమ ధాన్యం ఇప్పటికీ రైసు మిల్లులలోనే లారీలో నిలిచి ఉందని, కొనుగోలు చేసి 20 రోజులకు పైగా అవుతున్న బిల్లులో అకౌంట్లో రాలేదని అటువంటిది రైతు దినోత్సవం పేరుతో సంబరాలు ఎలా చేపట్టుకోవాలని అధికారులను రైతులు ప్రశ్నించారు. మండల కేంద్రంతో పాటు నాగేపూర్, యంచ, జన్నపల్లి రైతు వేదికలలో రైతు దినోత్సవ సంబరాలను అధికారులు, బి ఆర్ ఎస్ నాయ

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి

నవతెలంగాణ-దోమకొండ

అనుమానస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన దోమకొండలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండల కేంద్రానికి చెందిన సాహెబ్ గారి మల్లయ్య (65) వృద్ధుడు తన వ్యవసాయ భూమి వద్ద అనుమానస్పద స్థితి మృతి చెంది ఉన్నాడు. గ్రామ శివారులోని అందాలపల్లి హనుమాన్ ఆలయం సమీపంలో తన వ్యవసాయం భూమి వద్దకు వ్యవసాయం పనుల నిమిత్తం ఉదయం వెళ్లి రాత్రి అయినా రాకపోవడం తో వ్యవసాయం భూమి వద్ద కు వెళ్లి చూడగా ఆయన మృత దేహం ఉండడంతో పోలీస్‌లకు కుటుంబ సభ్యులు, స్థానికులు సమాచారం అందజేయడం తో సంఘటన స్థలాన్ని సీఐ తిరుపతయ్య,పోలీస్ లు, క్లూస్ టీం పరిశీలించారు. తన తండ్రి మృతిపై వ్యవసాయం భూమి వద్ద చుట్టూ పక్కన ఉన్న రైతులపై అనుమానం ఉన్నదని మృతుని కుమారుడు సాహెబ్ గారి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టుతెలిపారు.

గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి

నవతెలంగాణ-రామారెడ్డి

గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రగా గాయపడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మహిళ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జగదాంబ తండాకు చెందిన భూక్య మనీ (51)శనివారం సాయంత్రం మరిది ఇంటికి వెళ్లి వస్తుండగా, గుర్తు తెలియని వాహనం రామారెడ్డి నుండి అన్నారం వైపు వెళుతుండగా, ఆమెను వెనుక నుండి ఢీకొట్టడంతో తలకు, కాళ్లకు, శరీరంపై తీవ్ర గాయాలు అవడంతో, చికిత్స నిమిత్తం, ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందింది. మృతురాలు కుమార్తె గంగావతి రైనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఏఎస్ఐ సుభాషిని తెలిపారు.కులు ఘనంగా చేపట్టారు.

అనుమతి లేని కోచింగ్ సెంటర్ పాఠశాలలపై చర్యలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అనుమతి లేని కోచింగ్ సెంటర్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డీఈఓ దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు, కోచింగ్ సెంటర్లు 2023-24 అకాడమిక్ సంవత్సరానికి ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా నడిపే కొంతమంది పాఠశాలలు కోచింగ్ సెంటర్‌లు నడుపుతున్నారని, మరికొన్ని పాఠశాలలు, కోచింగ్ సెంటర్‌లు ప్రభుత్వ అనుమతి కాలం పూర్తి అయిన ప్పటికీ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా నడుపుతున్నారని పేర్కొన్నారు. అనేక సార్లు శాఖపరమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అయినా ప్రయివేటు పాఠశాలలు, కోచింగ్ సెంటర్లు యాజమాన్యం వారు శాఖపరమైన ఆదేశాలను, సమాచారం అందించిన లెక్కచేయకుండా అనుమతులు తీసుకోకుండా నడుపుతున్నారని, అనుమతి లేని ప్రైవేటు పాఠశాలకు, కోచింగ్ సెంటర్ లను తీసుకొని నడపాలని, లేకుంటే పాఠశాలలకు, కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలపై చర్యలుంటాయని పేర్కొన్నారు.

వీసీ, ఈసీ మెంబర్ల కొట్లాటతో విద్యార్థుల జీవితాలు ఆగం

- పీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ యూనివర్సిటీలో రోజురోజుకూ జరుగుతున్న పరిణామాలపై మాజీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు, పీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రిజిస్ట్రార్‌గా వీసీ ఒకరిని నియమిస్తే, ఈసీ మెంబర్లు ఇంకొకరిని రిజిస్ట్రార్‌గా నియమించడం పట్ల విద్యా వ్యవస్థ ఎటు పోతున్నదో అని ప్రశ్నించారు. దీనివల్ల యూనివర్సిటీ పేరు ప్రతిష్ఠలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. దీనిని విద్యార్థులు గమనించాలని సూచించారు. జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు తెలంగాణ యూనివర్సిటీ విషయంలో నోరు మెదపకపోవడం చాలా దారుణమని తెలిపారు.

పండుగలా వ్యవసాయం

- తెలంగాణ రైతులు దేశానికే ఆదర్శం..
- రైతుల కోసం రాష్ట్రంలో అనేక పథకాలు
- 'రైతు పండుగ'లో పలువురు ప్రజాప్రతినిధులు


డిచ్‌పల్లి : ట్రాక్టర్ నడుపుతున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్


కంఠేశ్వర్ : రైతు ర్యాలీలో అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-విలేకరుల బృందం

తెలంగాణలో వ్యవసాయం దండగ కాదని.. పండుగ అని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల రైతులతో కలిసి ర్యాలీలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు ఎడ్లబండెక్కి రైతు వేదికల వద్దకు చేరుకున్నారు.

డిచ్‌పల్లి : గుజరాత్ మోడల్ వద్దు.. తెలంగాణ మోడల్ ముద్దని, భారతదేశంలోనే అన్ని రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ అని, వ్యవసాయం దండగ కాదు పండుగ అని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మెంట్రాజ్‌పల్లి, రాంపూర్ డి, బర్దిపూర్, ఖిల్లా డిచ్‌పల్లి, యానంపల్లి, ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి, ఇందల్‌వాయి, లోలం గ్రామాల్లోని రైతువేదికలో నిర్వహించిన తెలంగాణ రైతు దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకుముందు గ్రామ శివారులో రైతులు, నాయకులు ఘనస్వాగతం పలికి ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీగా బయలుదేరి రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. జాతీయ గీతాన్ని ఆలపించి ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులకు, ప్రజలకు చదివి వినిపించారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.గంగాధర్ గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్మోహన్, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, దాసరి ఇందిరా లక్ష్మీనర్సయ్య, ఆర్డీవో రవి, తహసీల్దార్లు శ్రీనివాస్ రావు, టివి రోజా, ఎంపీడీఓ రాములు నాయక్, గోపి బాబు, ఏడీఏ ప్రదీప్ కుమార్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ నారాయణరెడ్డి, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మెంట్రాజ్‌పల్లి గ్రామంలో 22 లక్షల రూపాయలతో నిర్మించిన రైతువేదికను మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్మోహన్, దాసరి ఇందిర లక్ష్మీనర్సయ్య, నాయకులతో కలిసి ప్రారంభించారు.

వర్ని : తెలంగాణ రైతులు దేశానికి ఆదర్శమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బాన్సువాడ నియోజకవర్గం బీఆర్ఎస్ అధ్యక్షులు పోచారం సురేందర్‌రెడ్డి అన్నారు. వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్, జాకోరా, జాలాల్‌పూర్ రైతు వేదికలలో రైతు దినోత్సవ సమావేశాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల ఏఎంసీ చైర్మన్ కవిత అంబర్ సింగ్, వైస్ చైర్మన్ గోపాల్, మండల అధ్యక్షులు గిరి, సొసైటీల చైర్మన్లు సుధాకర్ రెడ్డి, ప్యారం అశోక్, నామాల సాయిబాబా, కృష్ణారెడ్డి, సంజు రెడ్డి, ఎంపీపీలు ఉమా పిట్ల శ్రీరాములు, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, లావణ్య రామ్‌రెడ్డి, మేక శ్రీలక్ష్మి వీర్రాజు, సుజాత నాగేందర్, సర్పంచులు సుమలత రామ్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, కర్ణం సాయిరెడ్డి, సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ధండ్ల బాలరాజు, జడ్పీటీసీ హరిదాస్ నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి నగేష్‌రెడ్డి, తహసీల్దార్ విఠల్, సాయిలు, వసంత, ముజీబ్, ఎంపీడీవోలు భారతి, నీలావతి, బశిరోద్దీన్ పలు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని అర్సపల్లి రైతులతో కలిసి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ర్యాలీ నిర్వహించారు. మున్నూరుకాపు సంఘంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాల ద్వారా వ్యవసాయ రంగంలో ఘననీయ పురోగతి సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత, స్థానిక కార్పొరేటర్ ముచుకుర్ లావణ్య నవీన్, కార్పొరేటర్‌లు ధర్మపురి, మల్లేష్ యాదవ్, విక్రమ్‌గౌడ్, రాఘవేందర్, సాయివర్ధన్ రైతులు పాల్గొన్నారు.

బోధన్ : రైతు దినోత్సవ వేడుకలను బోధన్ మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ మండలం మార్కెట్ కమిటీ ఆవరణలో గల రైతు వేదికను, పెంటాఖుర్దు గ్రామంలోని రైతు వేదికను, సాలుర మండలంలోని జాడి గ్రామంలో రైతు వేదికను ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జాడి గ్రామంలో గ్రామస్తులు ఎమ్మెల్యే షకీల్‌ను ఎడ్ల బండిపై భారీ గజమాలతో ఊరేగించారు. సాలూర గ్రామంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు వేదికల వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ బుద్దే సావిత్రి, ఆర్డీఓ రాజేశ్వర్, వ్యవసాయ శాఖ ఇన్చార్జి ఏడీఏ సంతోష్, ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయ్, వైస్ చైర్మెన్ షకీల్, డీసీసీబీ డైరెక్టర్లు, శరత్, గంగారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత బుద్దే రాజేశ్వర్, జాడి సర్పంచ్ జ్యోతి, మండల అధ్యక్షులు నర్సన్న, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణలో రైతే రాజు..

నందిపేట్ : మండల కేంద్రంలోని రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విశిష్ట అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్ రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, ఎంపీపీ సంతోష్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు మీసాల సుదర్శన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మచ్చర్ల సాగర్, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు వెల్మల్ రాజన్న, ఉప సర్పంచ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్గట్ల, గుమ్మిర్యాల్ క్లస్టర్ రైతు వేదికలో రైతు దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో రైతులు, నాయకులు ఊరేగింపుగా రైతు వేదికలకు చేరుకుని, జాతీయ గీతాలపనతో కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, వైస్ ఎంపీపీ సల్ల లావణ్య, ఎంపీటీసీ జక్కని మధు సూధన్, ఏఓ అబ్దుల్ మాలిక్, సర్పంచ్లు గుల్లే లావణ్య గంగాధర్, కుండ నవీన్, కట్కం పద్మాసాగర్, పత్తిరెడ్డి ప్రకాష్, గద్దెరాధ గంగారాం, మంజుల బాలాజీ గౌడ్, ఉపసర్పంచ్లు, రైతు బంధు సమితి మండలాధ్యక్షులు సున్నపు అంజయ్య, జిల్లా మెంబర్ నెరేళ్ళ లింగారెడ్డి, ఏర్గట్ల, తాళ్ళరాంపూర్ పీఏసీఎస్ చైర్మన్లు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలోని రైతు వేదికలో డ్రాగన్ ఫ్రూట్ పండిస్తున్న కోటగిరి రైతులు బర్ల గంగారం, రమేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత శ్రీనివాసరావు, సర్పంచ్ లక్ష్మణ్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, కోటగిరి విండో అధ్యక్షుడు కూచి సిద్దు, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ వహీద్, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక వ్యవసాయాన్ని ఓ పండుగలా తయారు చేశారని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రైతు వేదికలో ఏర్పాటు చేసిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపడుతున్న రైతు దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ గతంలో వ్యవసాయం చెయ్యాలంటే రైతులు అనేక ఇబ్బందులు పడేవారని తెలిపారు. సమయానికి కరెంటు లేక, సమయానికి యూరియా, విత్తనాల కొరకు పడిగాపులు కాసే వారమని, సీఎం కేసీఆర్ వచ్చాక సమయానికి రైతులకు యూరియా, సబ్సిడీపై విత్తనాలు, పనిముట్లు, నూతన గోదాముల నిర్మాణం, ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, తదితర అనేక పథకాలతో రైతులకు ఆదుకున్న మహనీయుడు కేసీఆర్ అని అన్నారు. మండలంలోని హొన్నాజీపేట్, ధర్పల్లి, రామడుగు, సొసైటీల పరిధిలోని రామడుగు, ధర్పల్లి, దుబ్బాక, హొన్నాజీపేట్ గ్రామాల్లోని రైతు వేదికల్లో ఆయా సొసైటీల చైర్మెన్ల అధ్యక్షతన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్లు చెలిమెల మల్లికార్జున్, ధర్మయ్య గారి రాజేందర్ రెడ్డి, మ్యాడారం రాజేందర్ రెడ్డిలు, రైతు సంఘం మండల అధ్యక్షుడు రాజ్పాల్, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీఓ లక్ష్మణ్, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

ఎడపల్లి : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రైతు దినోత్సవ వేడుకలను మండలంలోని జానకంపేట్, ఎడపల్లి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా కార్యక్రమాలపై అధికారులు క్షుణంగా వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గోపాలకృష్ణ మాట్లాడారు. అలాగే రైతుబంధు, రైతుబీమా తదితర పథకాల విశిష్టత తెలియజేసే విధంగా ఫ్లెక్సీలను రైతు వేదిక వద్ద అధికారులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులతో కలిసి సహపంక్తి భోజనాలు..

ముప్కాల్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదిక, మండలంలోని రెంజర్ల రైతు వేదికల వద్ద మండల ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులతో కలిసి రైతు సదస్సు నిర్వహించారు. అధికార పార్టీ నాయకులు ట్రాక్టర్లతో మండల కేంద్రంలో, రెంజర్ల గ్రామంలో ర్యాలీలు చేపట్టారు. ర్యాలీ అనంతరం పార్టీ నాయకులు రైతులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అధికారులు, రైతు సమన్వయ సమితి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ముప్కాల్, రెంజర్ల గ్రామాల సర్పంచులు కొమ్ముల శ్రీనివాస్, ఆకుల రాజేశ్వర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నాగంపేట్ ముత్తెన్న, తహశీల్దార్ పి.శ్రీకాంత్, ఎంపీడీవో దామోదర్, వ్యవసాయాధికారి రాజ్ కుమార్, ఎంపీవో భరత్ చంద్ర, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.


నందిపేట : మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే


వర్ని : మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు





కమ్మర్‌పల్లిలో..

సంబరంగా రైతు దినోత్సవం వేడుకలు

కమ్మర్‌పల్లి : మండలంలోని ఉప్లూర్, కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి, కోనాసముందర్ క్లస్టర్ రైతు వేదికల్లో రైతు దినోత్సవ వేడుకలు సంబరంగా నిర్వహించారు. అనంతరం రైతులందరికీ సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షురాలు గౌతమి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, ఆయా గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలో రైతు దినోత్సవ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఆఫీసు వద్ద రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినిత పవన్, స్థానిక కౌన్సిలర్ ఈశ్వరి రంగన్న, సుర్బిర్యాల్, ఫతేపూర్, గోవింద్‌పేట్ సర్పంచులు గణేష్, ఇందూర్ సాయన్న లక్ష్మి, బండమీది జమున గంగాధర్, పీఏసీఎస్ కమిటీ గోవింద్‌పేట్ అధ్యక్షులు బంటు మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బడిబాట


బోధన్ : బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : ఆచార్య జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట్ ఉపాధ్యాయులు బోధన్ పట్టణంలోని పలు కాలనీలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రాకాసిపేట్ పరిసర ప్రాంతాలలో విద్యార్థులు, వారి తల్లితండ్రులను కలసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ) ఫలితాలు, సదుపాయాలను వివరించారు. తొలిరోజు నిర్వహించిన బడిబాటలో 49 విద్యార్థులను నమోదు చేశారు. వారిలో డే స్కాలర్స్-17 మంది, హాస్టల్ విద్యార్థులు -32 మందిని నమోదు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వర్, వీరప్ప, రాచప్ప, శివశ్రీ రాణి తదితరులు పాల్గొన్నారు. కల్దుర్కి జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

కంఠేశ్వర్ : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను జీపీఎస్ జెండా గల్లి పాఠశాల పరిధిలోని దొడ్డి కొమురయ్య హ్యాబి టేషన్‌లో బడి ఈడు పిల్లల నమోదు కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు రామచందర్ గైక్వాడ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఉపాధ్యాయ బృందం మంజుల నరేష్, కవిత శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడి బయటి పిల్లలను బడిలో చేర్పించిన సర్పంచ్..

రెంజల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడి బయట పిల్లలను బడిలో చేర్పించడానికి దూపల్లి సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు సోమలింగం గౌడ్ ఆధ్వర్యంలో 8 మంది పిల్లలను వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ : మండలంలోని పచ్చల నడుకుడ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రధానోపాధ్యాయులు ఎస్ సురేష్ ఆధ్వర్యంలో, ఎస్ఎంసీ చైర్మన్ రాము ఉపాధ్యాయ బృందం కలిసి బడిబాట కరపత్రాలను ఆవిష్కరించారు.

బషీరాబాద్‌లో బడిబాట కార్యక్రమం

కమ్మర్‌పల్లి : మండలంలోని బషీరాబాద్ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని సర్పంచ్ సక్కారం అశోక్ ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ రవీందర్ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ప్రాథమిక విద్య 5వ తరగతి పూర్తయిన విద్యార్థులను ఉన్నత పాఠశాలలో పై తరగతికి చేర్చుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.తోట అప్ప య్య, శ్రీనివాస్, మనోహర్, రమేష్, నారాయణ, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీ బడిబాట..

రెంజల్ : మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి తెలిపారు. జూన్ ఒకటి నుంచి నూతన పిల్లలను ఎన్‌రోల్‌మెంట్ చేయడానికి తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సుజాత, సురేఖ, చిన్నారుల తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

బోధన్ నియోజకవర్గం ఆదర్శ రైతుగా సాయిబాబా గౌడ్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామానికి చెందిన ఆగంటి సాయిబాబాగౌడ్ బోధన్ నియోజకవర్గం ఆదర్శ రైతుగా ఎంపిక కాగా, బోధన్ ఎమ్మెల్యే మొహమ్మద్ షకీల్ అమీర్ ఆయనకు ఘనంగా సన్మానించారు.

ఉత్తమ ఎంపీడీఓ, ఏపీఓగా అవార్డులు

నవతెలంగాణ-వర్ని

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ బషీరోద్దీన్, ఏపీఓ చందర్‌కు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రంలో కలెక్టర్, మంత్రుల, ఎమ్మెల్యేల చేతుల మీదుగా బెస్ట్ అవార్డులను అందుకున్నారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి

- సీపీఐఎంఎల్ ప్రజాపంథా


ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూన్ 2 నుంచి 12 వరకు "తెలంగాణ దీక్ష దివాస్" పేరుతో నిరసన ప్రదర్శనలు చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సీపీఐఎంఎల్ ప్రజాపంథా నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్, డివిజన్ సహాయ కార్యదర్శి సీహెచ్.సాయాగౌడ్ మాట్లాడుతూ ఏ ప్రజాస్వామిక ఆకాంక్షలతో నిలువెత్తు ఉద్యమం నిర్మించి వందలాది మంది బలిదానాలు చేశారో, ఆ ఆశలు ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదన్నారు. తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగం అనే పదమే ఉండదన్న నినాదంపై ఎంతో ఆశలు పెంచుకున్నారన్నారు. రైతు రుణాలు రద్దవుతాయని, రేషన్ కార్డులు, ఇండ్లు, ఇంటి స్థలాలు, పెన్షన్లు అర్హులైన వారందరికీ వస్తాయని ఆశపడ్డారన్నారు. కానీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన వాగ్దానాలు అమలు పరచలేదన్నారు. పరిపాలన కేంద్రీకృతంగా, ఏకపక్షంగా సాగుతున్నదన్నారు. అవినీతి పెరిగిందన్నారు. బయట శక్తుల ప్రాబల్యమే కొనసాగుతున్నదన్నారు. ప్రజాస్వామిక హక్కులు హరించబడుతున్నాయన్నారు. ఈ విధానాలు, పరిణామాలు తెలంగాణ రాష్ట్రానికి అత్యంత నష్టకరమైనవన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని, ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా డిమాండ్ చేస్తున్నదన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలనీ, రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మి, గంగాధర్, సుమలత, రాజేష్, భూమేష్, సుజాత, స్వరూప, స్వప్న, మల్లేష్, లక్ష్మి, సావిత్రి, రమాదేవి, అమూల్య, విజయ, రామవ్వ, నారాయణ, బాల్ కిషన్, మమత, నాగరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉపాధి కల్పనలో శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఐ.టి.ఐ. బాలుర ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 10వ తరగతి పాసైన విద్యార్థులకు సువర్ణావకాశం, వృత్తి విద్యలో శిక్షణ పొంది జీవితంలో త్వరగా స్థిరపడాలని కోరుకునే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ వారి పారిశ్రామిక శిక్షణా కేంద్రాలలో (ఐ.టి.ఐ) ఉచితంగా అడ్మిషన్ పొంది వివిధ పారిశ్రామిక కోర్సులలో శిక్షణ పొందడానికి 2023 సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్టు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఐదు 5 ప్రభుత్వ ఐ.టి.ఐ.లో 1028 సీట్లు, 3 ప్రైవేటు ఐ.టి.ఐలో 488 సీట్లు ఉన్నాయని తెలిపారు. 14 సంవత్సరాల పై బడిన అభ్యర్థులు అర్హులని వయస్సు పరిమితులు లేవని https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని జూన్ 10 వరకు నోటిఫికేషన్, వివిధ కోర్సుల విద్యార్హతలకు సూచించారు. మరిన్ని వివరాలకు 9948195654, 9490057403 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

దొంగతనం కేసులలో ఇద్దరు అరెస్టు

- ఏసీపీ ప్రభాకర్‌రావు వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్ గ్రామ శివారులో శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్‌ను అమ్మడానికి వెళుతున్న దొంగలను పట్టుకున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రభాకర్ రావు తెలిపారు. పట్టణ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గోవింద్‌పేట్ నుంచి ఆర్మూర్ వైపు గల మారుతి ఆల్టో కారులో ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్‌ను అమ్మడానికి వెళుతున్న బార్ల పోశెట్టి, ఉప్పు సుధాకర్‌ను పట్టుకొని విచారించారు. వీరిపై బాల్కొండ, జక్రాన్‌పల్లిలో 6, మాక్లూర్, వేల్పూర్ 2, నందిపేట్‌లో 1, ఆర్మూర్‌లో 16 దొంగతనం కేసులు ఉన్నాయి. వరికుప్పల శ్రీనివాస్ అనే నేరస్థుడు పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి 60 కిలోల కాపరు వైరు, రూ.78,000 నగదుతో పాటు మారుతి ఆల్టో కారు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం వీటి విలువ మూడు లక్షల వరకు ఉంటుంది. నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యం ప్రదర్శించిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు, ఎస్ఐలు రాము, శివరాం, హెడ్ కానిస్టేబుల్ గఫర్, కానిస్టేబుళ్లు ప్రసాద్, తిరుపతికి ఏసీపీ రివార్డులు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు వేయించండి

నవతెలంగాణ-తాడ్వాయి

ఎండ్రియల్ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం నుండి దాదాపు 80లక్షలకు పైన నిధులు విడుదల అయి దాదాపు 6నెలలు గడుస్తున్న ఇంకా రోడ్డు నిర్మాణం పనులు మొదలు కాలేదని, రోడ్డు ప్రమాదకరంగా మారి గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నార ఇకనైనా రోడ్డు పనులు ప్రారంభం అయ్యేలా చూడాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి వీరానందరావు కు గ్రామ వార్డు మెంబర్ తిరుపతిరెడ్డి గ్రామస్తులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ రోడ్డు మార్గం గుండా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే అధికారులు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చేది వర్ష కాలం అని, అలాగే ఎలక్షన్ కోడ్ వచ్చే అవకాశం ఉందని కావున ఎమ్మెల్యే కూడా చొరవ తీసుకొని కాంట్రాక్టర్ పనులు త్వరగా ప్రారంభం చేసేలా చూడాలని కోరారు.

ఆనందిరం జరుకోవ్వలం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
ఆదివారం 04 జూన్ 2023

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెస్లీ నగర్ తండా జాతీయ రహదారి 44 పై శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. సిరికొండ మండలం పెద్ద వాల్గోట్ నుండి జాక్రన్ పల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి ప్రమాదవశాత్తు రహదారి కింద పడిపోవడంతో బాలయ్య (58) నెత్తికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై కచ్చకాయల గణేష్ తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కేసీఆర్ హయాంలోనే రైతే రాజు

- అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో
- పండుగలా మారిన పంట సాగు
- శతాబ్ది ఉత్సవాలు బాగా పలు గ్రామాల్లో రైతు దినోత్సవం
- రైతువేదికల్లో సదస్సులు

నవతెలంగాణ-విలేకరులబృందం


సదాశివనగర్‌లో ఎడ్లబండిపై ఎమ్మెల్సీ కవిత


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

రైతే రాజు అని ఏండ్లుగా నాయకులు ప్రచారం చేశారే తప్పితే వారి సంక్షేమం కోసం ఎలాంటి కృషి చేయలేదని, కానీ కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను రారాజు చేసిందని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవం నిర్వహించారు. ఎడ్లబండ్లతో రాస్తారోకో నిర్వహించారు. అందంగా ముస్తాబు చేసిన రైతు వేదికల్లో రైతులతో సమావేశం నిర్వహించి బీఆర్ఎస్ హయాంలో సాగు అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కేసీఆర్ సర్కార్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా రైతులకు వివరించారు.

తెలంగాణ రాక ముందు రైతుల ఆత్మహత్యల

సదాశివనగర్ : తెలంగాణ రాకముందు రైతుల ఆత్మహత్యలు ఉండేవని ఎమ్మెల్సీ కవిత, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సదాశివ నగర్ మండలంలోని పద్మాజివాడి రైతు వేదికలో రైతు దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రైతు వేదిక శిలాఫలకాన్ని ఎమ్మెల్సీ కవిత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ తో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్రంలో 21 రోజులపాటు తెలంగాణ ఆవిర్భావ అవతరణ పండుగను జరుపుకుంటున్నామని అన్నారు. రాష్ట్రం ఏర్పడి పదవ ఏడాదిలోకి అడుగుపెట్టిందని ఒకసారి సింహవ లోకనం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకోలేదని, రైతులను రాజు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. సరిహద్దులో జవాన్ పంట పొలంలో రైతు ఇద్దరి వల్లే మనం ప్రశాంతంగా జీవిస్తున్నామని అన్నారు. వ్యవసాయం దండగ అనే స్థితి నుంచి పండగ అనే స్థితికి తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నేడు మన ప్రభుత్వంలో నకిలీ విత్తనాలు లేవు, ఎరువుల కొరత లేదు, వ్యవసాయ రంగానికి కరెంటు సమస్య లేదు. నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగు చేసుకున్న తర్వాత గ్రౌండ్ వాటర్ పెరిగిందని అన్నారు. వరి సాగులో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. రైతుల కోసం సంఘాలు పెట్టిన ఘనత కేసీఆర్ కి దక్కుతుందన్నారు. రైతులకు రైతుబంధు, రైతు బీమా ఇచ్చి అండగా ఉన్నామని రైతు వేదికలు నిర్మించామని అన్నారు. రైతులు లాభదాయకమైన పంటల వైపు దృష్టి పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి గైని అనసూయ, జెడ్పి చైర్ పర్సన్ దఫేదర్ శోభ, జిల్లా కలెక్టర్ జితేశ్ పాటిల్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు ముజుబుద్దిన్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, డి.ఎ.ఓ భాగ్య లక్ష్మీ ఏవో ప్రజాపతి, రైతుబంధు అధ్యక్షులు ఏలేటి భూంరెడ్డి, మండల అధ్యక్షులు బొల్లిపల్లి మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్గం సాయి రెడ్డి, వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, సొసైటీ చైర్మన్లు, వైస్ చైర్మన్ లు, డైరెక్టర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

లింగంపేట్ : మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి రైతు వేదిక వరకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీగా రైతు వేదికకు చేరుకున్నారు. లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ కూచంపల్లి దేవేందర్ రెడ్డి. ఎంపీపీ గరీబునిసా నయీమ్ మాట్లాడారు. రైతులు ఆర్థికంగా ఎదగడానికి దేశంలో ఏ రాష్ట్రంలో రైతుబంధు రైతు బీమా ప్రవేశపెట్టలేదన్నారు. కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని అన్నారు. మండలంలో ఇతర రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించారు. రైతులు పొందిన లబ్ధిపై ప్రత్యేక కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగంపేట్ సింగల్ రెండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నల్లమడుగు సింగిల్ విండో చైర్మన్ రమేష్, శెట్టిపల్లి సంగారెడ్డి సింగిల్ విండో చైర్మన్ సుకన్య, వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, పశువైద్యాధికారి రవికుమార్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పతియోద్దీన్, రాజశేఖర్ రెడ్డి, దేశనాయక్, ఆయాగ్రాముల సర్పంచులు ఎంపీటీసీలు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రైతు సమన్వయ కమిటీ సభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.


గాంధారిలో ర్యాలీ..


ట్రాక్టర్ నడుపుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి


లింగంపేట్‌లో ఎడ్లబండ్లతో ర్యాలీ

రైతు దినోత్సవ వేడుకల్లో సైబర్ నేరాలపై అవగాహన

నసురుల్లాబాద్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ అబిడ్ బేగ్ సూచించారు. శనివారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో నిర్వహిస్తున్న రైతు దినోత్సవ వేడుకల్లో వచ్చిన రైతులకు నసురుల్లాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, లోన్ యాప్, ఫేస్ బుక్, వాట్సాప్, ట్విట్టర్ వంటి యాప్స్ లలో ఫ్రెండ్ రిక్వెస్ట్ లాంటి పోస్టులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారి మాట్లాడుతూ పంట డబ్బులు బ్యాంక్ నుంచి తీసుక వెళ్ళేటప్పుడు, ఎరువుల కోసం డబ్బులు తీసుక వెళ్ళేటప్పుడు రైతులు జాగ్రత ఉండాలని, అవసరం అనుకుంటే కుటుంబ సభ్యులను తోడు తీసుక వెళ్లాలని సూచించారు.

బ్యాంకు అధికారులుగా మాట్లాడేవారిని, రుణాలు ఇస్తామని చెప్పే వారిని నమ్మొద్దన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరిస్తే వెంటనే డయల్ 100కు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అపరిచితుల మాటలను నమ్మొద్దని, వారికి ఎలాంటి వివరాలు చెప్పొద్దని, మోసపూరిత ఫోన్ కాల్స్, మెసెజ్‌లకు స్పందించకూడదన్నారు. అవగాహనతోనే ఆన్‌లైన్, సైబర్ మోసాలను అడ్డుకోవచ్చని ఏఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బుజ్జి, కానిస్టేబుల్ రఘు, అంజయ్య, అధికారులు, రైతులు, ప్రజలు ఉన్నారు.

రామారెడ్డి: మండలంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా, రైతు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని రామారెడ్డి, అన్నారం, కన్నాపూర్, పోసానిపేట్ రైతు వేదికల పరిధిలో, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు వేదికలో ఎంపీపీ దశరథ్ రెడ్డి తో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు తెలంగాణ ప్రభుత్వం, రైతులకు చేసిన సంక్షేమ ఫలాలు, రైతు అభివృద్ధికి చేపట్టిన పథకాలపై రైతులకు వివరించారు. అనంతరం రైతు వేదిక పరిధిలో, రైతులకు సహాపంకి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముత్తినేని రవీందర్రావు, మండల రైతుబంధు అధ్యక్షులు నారాయణరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, రైతుబంధు జిల్లా డైరెక్టర్ కాసర్ల రాజేందర్ తెలిపారు.

ప్రజలే మా ఆత్మీయులు.. వారి సంక్షేమమే ధ్యేయం : స్పీకర్

నసురుల్లాబాద్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సిఎం కేసీఆర్ పని చేస్తున్నారని రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రతి గుంటకూ సాగు నీరందించడం, పండించిన ధాన్యం కొనుగోలు చెయ్యడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం బాన్సువాడ నియోజకవర్గం లోని బీర్కూర్ మండలం బైరాపూర్, బాన్సువాడ గ్రామీణ మండలం దేశాయిపేటలో జరిగిన రైతు దినోత్సవంలో స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ రైతు వేదిక వద్దకు స్పీకర్ పోచారం చేరుకున్నారు. బీర్కూర్ మండలంలోని బైరాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతు దినోత్సవాన్ని జరుపుకుంటున్న అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇదొక పండుగ రైతు లేకపోతే రాజ్యం లేదని, కులాలకు, మతాలకు అతీతంగా అందరూ కలిసి జరుపుకునే రైతు పండుగ అన్నారు.

2014లో తెలంగాణ రాష్ట్రంలో మొత్తం వరి ధాన్యం ఉత్పత్తి 36 లక్షల మెట్రిక్ టన్నులు. 2021-22 లో 1.30 కోట్ల టన్నులకు పెరిగిందన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి ఇప్పటి వరకు 700 కోట్ల రూపాయల రైతుబంధు నిధులు వచ్చాయి. 1500 మంది రైతులు చనిపోతే 75 కోట్లు రైతుబీమా డబ్బులు అందయన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 2014 కు ముందు వానాకాలంలో సాగు 70,000 ఎకరాలు అయితే నేడు 1.10 లక్షల ఎకరాలకు, యాసంగిలో 50,000 ఎకరాల నుండి 1.10 లక్షల ఎకరాలకు పెరిగింది. సంక్షేమ పథకాలు అందించడంలో దేశంలోని ఆదర్శంగా నిల్చామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జితేష్ వి పాటిల్ ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ ఆర్డిఓ రాజా గౌడ్ మాజీ జెడ్పిటిసి సతీష్, జెడ్పిటిసి స్వరూప శ్రీనివాస్, అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గాంధారి: మండలంలోని రైతు వేదికల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధా బలరాం, జడ్పిటిసి సభ్యులు శంకర్ నాయక్, సొసైటీ చైర్మన్ సాయికుమార్, ముదెల్లి సొసైటీ చైర్మన్ సత్తెనపల్లి సాయిరాం, గాంధారి సర్పంచ్ ముమ్మాయి సంజీవ్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ సత్యం రావు, వ్యవసాయ అధికారులు వివిధ శాఖల అధికారులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కేసీఆర్ కృషి

దొమకొండ: రాష్ట్రంలో రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ శారదా, జడ్పీటీసీ తీర్మల్‌గౌడ్ అన్నారు. తెలంగాణ దశబ్ది ఉత్సవలలో భాగంగా దోమకొండ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ప్రజా ప్రతినిధులు, అధికారుల, రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్, సర్పంచ్‌లు అంజలి, నర్సవ్వ, ఏవో పవన్ ఎంపీటీసీలు, వెంకట లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ : బాన్సువాడ మండలం సోమేశ్వర గ్రామం రైతు వేదిక నుంచి ఎడ్ల బండ్ల ర్యాలీలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిసిసిబి చైర్మెన్ పోచారం భాస్కర్ రెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమేశ్వర గ్రామం పలు విధుల్లో ఎడ్ల బండ్లు ర్యాలీ పలు విదులల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సహకార సంఘం అధ్యక్షులు ఏర్వల కృష్ణారెడ్డి, చైర్మన్ నర్సింలు, మాజీ ఎంపిపి మొహమ్మద్ ఏజాజ్, కాప్షన్ బాబా సర్పంచ్ పద్మ మోగులయ్య, నాయకులు కొర్ల పోతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో సీఎం కేసీఆర్ కీలకపాత్ర : భాస్కర్‌రెడ్డి

దేశ రాజకీయాల్లో సీఎం కేసీఆర్ కీలకపాత్ర పోషించనున్నారని ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు దాశబ్ది ఉత్సవాలలో డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమ కోసం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా వివరించారు. రైతులకు కులం, మతం, ప్రాంతం లేదన్నారు. పేదలు, అర్హులైన వారికి మాత్రమే పెన్షన్లు మంజూరు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్య విఠల్, మండల పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మజీద్, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ గంగారం, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంది మల్లేష్, నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, మోహన్ నాయక్, వైశాగౌడ్, నర్సింలు గౌడ్, సాయగౌడ్, భూమయ్య, సొసైటీ కార్యదర్శి నరేందర్, శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి దత్తతేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: తెలంగాణ అవతరణ దశాబ్దాల ఉత్సవాల లో భాగంగా శనివారం రెండవ రోజు ఎల్లారెడ్డి మండలం లోని లక్ష్మ పూర్ , మీసాన్ పల్లి, బ్రమ్మణ పల్లి , అజమాబాద్ గ్రామాల్లో అధికారులు , నాయకులు రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఏ ఎం సి చైర్మన్ కాశీ నారాయణ, ఎంపీపీ మాధవి, తహశీల్దార్ సుధాకర్, ఎం పి ఓ ప్రకాష్, ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక సాధన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హాయంలో గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో రైతు సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశ పెట్టారని, రైతుబంధు, బీమా దేశానికే ఆదర్శంగా నిలిచాయని మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ తెలిపారు. మద్నూర్ ఉమ్మడి మండలంలోని మద్నూర్ డోంగ్లి మండలాల పరిధిలో మొత్తం వ్యవసాయ 9 క్లాస్టార్లలో రైతు దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా కొడిచెర్ల గ్రామంలో జరిగిన రైతు దినోత్సవం వేడుకల్లో ఇద్దరు చైర్మన్లు మాట్లాడారు.

రైతువేదికల్లో కాంతులతో మిరుమిట్లు

నవతెలంగాణ-జుక్కల్/మద్నూర్

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని నాగల్‌గావ్, పెద్దఎడ్గి, జుక్కల్, హంగర్గ, డోన్గాం, ఖండేబల్లూర్, పెద్దగుల్లా, క్లస్టర్ల పరిధిలోని రైతువేదికలను అలంకరించడంతో విద్యుత్ దీప కాంతులతో మిరుమిట్లు గొల్పుతున్నాయి. శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఆవిర్భావం నుండి జరిగిన వ్యవసాయ రైతుల అభివృద్ధిని సాగు పురోగతిపై వివరించారు. అంతకుముందు రైతులు ఎడ్ల బండ్లు, రైతులు వ్యవసాయంలో ఉపయోగించే సామగ్రిని చేత బట్టి డప్పు మేళాలతో గ్రామం నుండి ఊరేగింపుగా రైతు వేదికలకు చేరుకున్నారు.

కాలాస్ ప్రాజెక్టుకు కాంతులు

మండలంలోని సావర్గావ్ గ్రామంలో నిర్మించిన కౌలాస్ నాళా ప్రాజెక్ట్ విరజిమ్మే కాంతులతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను అధికారులు ముస్తాబు చేశారు.

నోరూరించే వంటకాలు

మద్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం శనివారం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా రైతువేదికల్లో నిర్వహించిన రైతు దినోత్సవంలో రైతులకు కమ్మటి వంటకాలు వడ్డించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు సింగిల్ విండోల ద్వారా వంటకాల ఏర్పాట్లు చేశారు. మాంసాహారంతో పాటు శాఖహారం వంటకాలు వడ్డించారు.

ఈసీ సమావేశానికి వీసీ డుమ్మా

- కొలిక్కిరాని టీయూ వ్యవహారం
- వైస్ ఛాన్స్‌లర్‌పై క్రిమినల్ కేసు నమోదుకు నిర్ణయం
- త్వరలో గవర్నర్‌కు టీయూ వ్యవహారంపై ఫిర్యాదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

60వ పాలక మండలి సమావేశానికి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవిందర్ మరోసారి డుమ్మా కొట్టారు. సమావేశానికి హాజరవుతారని ఈసీ,ఇతర సభ్యులు అనుకున్నప్పటికీ ఆయన సమావేశానికి హాజరు కాలేదు. సమావేశంలో పాలక మండలి సభ్యులు వీసీ చేసిన అక్రమాలపై విచారణ కమిటీని వేయాలని ఈసీ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ డి రవీందర్ గుప్త పై శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ముందడుగు వేసిందని, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణ, విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్ లోని రూసా భవనంలో జరిగిన తెలంగాణ యూనివర్సిటీ పాలక మండలి సమావేశంలో గత కొన్ని నెలలుగా జరిగిన యూనివర్సిటీ పరిణామాలపై, గతంలో పాలక మండలి సమావేశాల సందర్భంగా తీసుకున్న నిర్ణయాలపై కులంకుశంగా చర్చించి ఆమోదం పొందారు. వైస్ ఛాన్సలర్ చేసిన అక్రమ నియామకాలపై, ఇతర పేర్ల మీద బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసిన వైనంపై, దినసరి ఉద్యోగం కింద పనిచేసిన వారికి ఈసీ అనుమతి లేకుండానే బ్యాంకు నుండి 28 లక్షల రూపాయలు చెల్లించిన వాటిపైన కమిటీని వేసి చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇటీవల వైస్ ఛాన్సలర్ నియమించిన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ కనకయ్య నియామకం ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లదని ఈసీ సభ్యులు స్పష్టం చేశారు. ప్రొఫెసర్ కనకయ్యపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సమావేశం లో నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. వీసీకి రిజిస్ట్రార్ను నియమించే అధికారం ఎం మాత్రం లేదని పాలక మండలి సభ్యులు వివరించారు. పాలక మండలి సమావేశం లో తీర్మానించిన రిజిస్ట్రార్ తోనే యూనివర్సిటీ పరిపాలన వ్యవహారాలను నడిపించే విధంగా చూడావల్సి ఉంటుందని సభ్యులు తెలిపారు. త్వరలోనే యూనివర్సిటీల చాన్సలర్, గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్ ను కలిసి వైస్ చాన్సలర్ చేసిన అవినీతి అక్రమాల చిట్టాను పాలక మండలి సభ్యులు అందజేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు వారు తెలిపారు. యూనివర్సిటీకి సంబంధంలేని సుశృత్ రెడ్డి పై సైతం కేసు నమోదు చేయాలని సమావేశం లో తీర్మానించారు.

సైకిల్ తొక్కడంతో ఆరోగ్యం, ఆనందం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

శారీరక, మానసిక దృఢత్వం, ఆరోగ్యకరమైన జీవన పెంపొందించు కునేందుకు సైక్లింగ్ ఉపయోగపడుతుందని నసురుల్లాబాద్ ఎంపిపి పాల్య విఠల్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నెహ్రు యువజన సంఘం ఆధ్వర్యంలో నసురుల్లాబాద్ మండలంలోని సంగెం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీని ఎంపిపి పాల్య విఠల్ ప్రారంభించి మాట్లాడారు. గతంలో ప్రతిపనికి సైకిల్‌ను విరివిగా వినియోగించేవారమని తెలిపారు. కానీ ప్రస్తుతం మారుతున్న జీవన శైలీతో సైకిల్ వినియోగం తగ్గిందని తెలిపారు. మనలో ఎవరైనా సైకిల్ తొక్కుతూ బయటకు వచ్చారంటే చూసినవాళ్లంతా ఎగతాళి చేస్తుంటారు. ఇదే వంకతో మనం సైకిల్ తొక్కడానికి నామోషీ అవుతుంటాం. సైకిల్ వాడకం, సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. వివిధ గ్రామాల నుంచి సైకిల్ నడిపే పిల్లలకు పోటీ నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులను ఎంపిపి అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రు యువజన సంఘ్ నాయకులు సునీల్ రాథోడ్ గ్రామస్తులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని భిక్నూర్ గ్రామంలో భవననిర్మాణ కార్మిక సంఘం కమిటీని మండల ప్రధాన కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు మార్లు సాయిబాబు ఆధ్వర్యంలో గ్రామ కమిటీని శనివారం ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి లేబర్ కార్డు ఉండాలని, బోగస్ కార్డులు ఉంటే సర్వే చేసి తొలగించాలని కోరారు. ఆయన వెంట మండల నాయకులు ఉపాధ్యక్షులు సంజీవులు ఉన్నారు.

భిక్నూర్ కమిటీగా అధ్యక్షులు ఆంధ్రయ్య ఉపాధ్యక్షులు ప్రకాష్. ప్రధాన కార్యదర్శి సాయిలు, ప్రచార కార్యదర్శి సంగమేష్, కోశాధికారి జయరాజ్ సలదారులుగా యాదయ్య సభ్యులు పెంటయ్య సామెల్ గణేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలయ్య, సాయిలు, గోపాల్, దుర్గయ్య ఆశయ, సంజీవులు, శివరాం, సాయి రాములు, రాజు అనిల్ శ్రీకాంత్ సంతోష్ విజయ్ అమృతి తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికైన కమిటీ

వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-రామారెడ్డి


మృతిచెందిన లక్ష్మి

జీవితంపై విరక్తి చెంది వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బండి లక్ష్మి (47) కుమారుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా, కూతురు విడాకులు కావడంతో ఇంట్లో ఉంటుంది. కుటుంబ పరిస్థితులతో మానసికంగా రోజు కుంగిపోయేదని, గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంట్లో నుండి వెళ్లి, తిరిగి రాకపోవడంతో బంధువుల ఇండ్లలో, చుట్టుపక్కల వేతుకుంతుండగా శనివారం గ్రామ శివారులోని పటేల్ చెరువులో మృతదేహం కనిపించించింది. భర్త బండి చిన్న లింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఏఎస్ఐ సుభాషిని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు

తెలంగాణ ఉద్యమకారుడికి సన్మానం

నవతెలంగాణ-పిట్లం


ఉద్యమకారున్ని సన్మానించిన పలువురు

తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమ కారుడైన మంగలి రాములకు కాంగ్రెస్ , బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమములో పోరాడి జైలు పాలైన ఉద్యమకారుడు మంగలి రాముల చేసిన పోరాటాలు అమోఘమని అన్నారు. తెలంగాణ ఆవిర్భవించి 10 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో ఆయన పోరాటాలను వెలకట్టలేమని, ఆయన స్ఫూర్తిని కొనియాడుతూ అభినం దించి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శపథంరెడ్డి, ఏవో కిషన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జొన్న శ్రీనివాస్ రెడ్డి , నర్సా గౌడ్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్ రెడ్డి , బొంతపల్లి కృష్ణమూర్తి , బొడ్ల రాజు , సాయిలు (బన్నీ) అజ్మల్, తదితరులు పాల్గొన్నారు..

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌కు 11 వరకు అవకాశం

నవతెలంగాణ-కంఠేశ్వర్

పదవతరగతి మార్చి-2023లో జీపీఏ 7.0 కంటే ఎక్కువ పొందిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వెల్ఫేర్‌కు చెందిన విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం 2023-2024 కార్పోరేట్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశమునకు గానూ తదుపరి ఎంసెట్ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణను పొందేందుకు అర్హత గల విద్యార్థులు ఆన్లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈ నెల 3 నుంచి 11 వరకు అవకాశం ఉందని నిజామాబాద్ జిల్లా షెడ్యూల్ కులాల అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఇది వరకు నమోదు చేసుకోని విద్యార్థులు నమోదు చేసుకోవాలని సూచించారు.

మంగళ్‌పాడ్‌లో గంగాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయం మొదటి వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శివ గంగమ్మ చిత్రపటంతో శోభాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గంగాదేవి దీక్ష స్వాములు సాయిబాబా, జనార్ధన్ పల్లె పోశెట్టి, తక్కిల నరేష్, నాగబోయి గంగాధర్, బక్కోళ్ల శ్రీకాంత్, గంగపుత్ర సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

- పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- 23 వార్డులో నమస్తే నవనాథపురం

నవతెలంగాణ-ఆర్మూర్

ఇంటింటికీ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. 'నమస్తే నవనాథపురం' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 23వ వార్డులో జరిగిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఉదయం 23వ వార్డులో అడుగుపెట్టిన జీవన్‌రెడ్డికి బస్తీ ప్రజలు ఘనస్వాగతం పలికారు. 'కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి, దేశ్ కీ నేత కేసీఆర్, జీవనన్న జిందాబాద్, జై తెలంగాణ' నినాదాలు చేస్తూ ఆయనను పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం ఆయన 23వ వార్డు అంతా కలియ తిరుగుతూ ప్రజలతో మమేకమయ్యారు. ప్రతీ ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 'అమ్మా బాగున్నారా' అంటూ మహిళలను పలకరించారు. మీ కాలనీలో మిషన్ భగీరథ మంచినీళ్లు వస్తున్నాయా, నీళ్ల ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తున్నారా, పెన్షన్లు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ కొత్త నల్లా కనెక్షన్లు అవసరమైతే వెంటనే నల్లా కనెక్షన్లు ఇవ్వాలని జీవన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కొన్ని చోట్ల నీళ్లు రోడ్లపై వృథాగా పోవడాన్ని గమనించిన ఆయన మున్సిపల్ అధికారులను మందలించారు. 23వ వార్డులోని భాషిత స్కూల్ సమీపంలో ఒక కల్వర్టు అవసరమని స్థానికులు జీవన్ రెడ్డి దృష్టికి తెచ్చారు. దీనిపై అక్కడికక్కడే స్పందించిన ఆయన త్వరితగతిన కల్వర్టు నిర్మాణం పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అయ్యప్ప లావణ్య శ్రీనివాస్, కౌన్సిలర్ ఈటడి నర్సారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ కుమార్, ఏఈ రఘుకుమార్, ఆర్మూర్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పూజ నరేందర్, పార్టీ ముఖ్య నాయకులు తమ్మి శ్రీనివాస్, రవిగౌడ్, అంజాగౌడ్, నరేష్, పండిత్ వినీత పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో 500 మెట్రిక్ టన్నుల గోదాం ప్రారంభం..

రైతన్నలు పండించిన పంటలు నిల్వ చేసుకోవడానికి వీలుగా ప్రభుత్వం చేపట్టిన గోదాముల నిర్మాణంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి వెల్లడించారు. ఆలూర్ మండల కేంద్రంలో 33 లక్షల 14 వేల రూపాయల వ్యయంతో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంకు జీవన్‌రెడ్డి ప్రారంభించారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా జరిగిన రైతు దినోత్సవ పండగ సందర్భంగా జీవన్ రెడ్డి ఈ గోదాంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయ దిగుబడులు ఏటేటా పెరుగుతున్నాయని తెలిపారు. దీంతో గోదాముల సామర్థ్యం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యంగా మార్కెటింగ్ శాఖ తన గోదాముల సామర్థ్యాన్ని 7.38లక్షల టన్నుల నుంచి 24.73 లక్షల టన్నులకు పెంచుకుందని తెలిపారు.

ఇది పక్కా రైతు ప్రభుత్వం..

రైతుల కోసం ప్రాణమిచ్చే సీఎం కేసీఆర్ పెద్ద రైతు అని తెలిపారు. రైతులకు మరిన్ని మేలు చేసే కార్యాక్రమాలు త్వరలోనే రానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కళ్లెం బోజారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీ మల్లేష్, వీడీసీ అధ్యక్షులు బార్ల గణపతి తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే..


నమస్తే నవనాథపురం కార్యక్రమంలో ఎమ్మెల్యే

ప్రపంచ సైకిల్ దినం సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుంచి పెర్కిట్ చౌరస్తా మీదుగా తిరిగి మళ్ళీ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు సైకిల్ తొక్కడం వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడుతుందని అన్నారు. అలాగే బరువు పెరగకుండా చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా 50 సైకిళ్లను మంజూరు చేశామని, ఈ సైకిళ్లు మామిడిపల్లిలోని అర్బన్ పార్క్ నందు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ముత్యంరెడ్డి, రుద్ర శ్రీనివాస్, రాజేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

స్కార్పియోలో చెలరేగిన మంటలు

- తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-ఎడపల్లి


స్కార్పియోలో ఎగిసిపడుతున్న మంటలు

మండల ంలోని నెహ్రూనగర్ గ్రామ సమీపంలో గల బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారిపై వెళుతున్న స్కార్పియో వాహనం నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఇది గమనించి వాహనంలో ప్రయాణిస్తున్న పలువురు వెంటనే వాహనాన్ని నిలిపివేసి కిందికి దిగి పోవడంతో ప్రాణనష్టం తప్పింది. షాక్ సర్క్యూట్ కారణంగానే వాహనంలో మంటలు చెలరేగినట్టు వారు భావిస్తున్నారు. వాహనంలో మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బందికి వెంటనే సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి.. మంటలను ఆర్పి వేశారు.

బోధన్ నియోజకవర్గం ఉత్తమ ఆదర్శ రైతుగా అల్లం రమేష్


ఆదర్శరైతును సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నవీపేట్

బోధన్ నియోజకవర్గ ఉత్తమ ఆదర్శ రైతుగా రాంపూర్ మాజీ సర్పంచ్ అల్లం రమేష్ ఎంపిక కావడంతో ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ శనివారం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం రైతు దినోత్సవం సందర్భంగా అల్లం రమేష్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. తనకు నియోజకవర్గ ఉత్తమ ఆదర్శ రైతుగా ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యే షకీల్ ఆమెర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న సుచరితరెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పైడి రాకేష్ రెడ్డి సేవ కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నారు. డొంకేశ్వర్ మండలంలోని నికాల్‌పూర్ గ్రామంలో రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ తరుపున డైరెక్టర్ సుచరితరెడ్డి గ్రామంలోని మూడు కుటుంబాలకు శనివారం రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం చేశారు. గాండ్ల రవి ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా.. వారి కుటుంబానికి రూ.10వేలు, రమ అనే మహిళ భర్త నరేందర్ పాముకాటుతో చనిపోతే వారికి రూ.10వేలు, మేదరి సంతోష్ పక్షవాతంతో బాధపడుతుండటంతో వారి కుటుంబానికి రూ.10వేలు అందజేసి అవసరం మేరకు ఆసుపత్రిలో చూపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవన్, గంగారెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆకుల లలిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు టీఎస్ డబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత రాఘవేందర్ శనివారం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖను ఎప్పటికప్పుడు అభివృద్ధి పరుస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని కోరారు.

బడిబాట కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి ప్రతినిధులచే కరపత్రాల ఆవిష్కరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాడ వేడి పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండమీది జమున గంగాధర్, ఎంపీటీసీ యల్లా రాజకుమార్, ఎస్ఎంసీ చైర్మెన్ సయ్యద్ అంజాద్, వీడీసీ అధ్యక్షులు లింగన్న, సొసైటీ చైర్మెన్ బంటు మహిపాల్, సచివాలయ వార్డు సభ్యులు సిబ్బంది, ఉపాధ్యాయ బృందం బావాయి, నౌషీన్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా రథయాత్ర


రథయాత్రలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల

సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా నిజామాబాద్ జిల్లా డొంకల్ గ్రామం నుంచి సుమారు 25 గ్రామాల మీదుగా, రెండు రోజుల పాటు రథయాత్ర కొనసాగిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా రథయాత్ర శనివారం ఏర్గట్ల గ్రామానికి చేరుకోవడంతో భక్తులు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు సేవా సమితి సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బడిబాటలో తడపాకల్ ఉపాధ్యాయులు


బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఏర్గట్ల

తెలంగాణ విద్యాశాఖ నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా తడపాకల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ఇందులో భాగంగా బడిఈడుకు వచ్చిన, బడి మానేసి పనిలో చేరిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందుతున్న వసతులను గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు ప్రవీణ్‌శర్మ, రవీందర్, శంకర్, నాగప్ప, నరేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర మినీ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్


శిక్షణ శిబిరంలో క్రీడాకారులు

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న మినీ సబ్ జూనియర్ (అండర్-11), అండర్-13) బాల బాలికల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ డాక్టర్ రామరాజు విచ్చేసి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. తాను 50 సంవత్సరాల క్రిందట సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, వాలీబాల్ క్రీడలలో చాలా చురుకుగా పాల్గొనేవాడినని, అందుకే తాను ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నానని వివరించారు. ఈ చిన్నారి క్రీడాకారులను చూస్తే నా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని తెలిపారు. ఆటలు ఆడడం అంటే ఆరోగ్యంగా ఉండటమే, చిన్నతనం నుంచే ఆటలలో చురుకుగా పాల్గొంటే ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉండవు, చదువుతోపాటు క్రీడలు ఆడటం వలన శారీరకంగా మానసికంగానే కాకుండా సామాజికంగా నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని వివరించారు. ఆటలు ఆడటం వల్ల జీవితంలో ఎదురయ్యే ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొనే శక్తిని సాధించవచ్చునని తెలిపారు. ఈ నెల 6 నుంచి 8 వరకు ఆర్‌డీటీ స్టేడియం అనంతపూర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగే జాతీయ పోటీలో రాష్ట్ర జట్టును గెలిపించి బంగారు పతకాలు అందుకొని విజయంతో తిరిగి రావాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ నందిని, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బి మల్లేష్‌గౌడ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, సంయుక్త కార్యదర్శి మర్కంటి సుజాత, సాఫ్ట్‌బాల్ నిర్మల్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి అన్నపూర్ణ, వ్యాపారవేత్త పిప్పర హనుమాన్లు, కోచ్ మేనేజర్లు నరేష్, జోష్న, సాయికుమార్, రాజేందర్, తిరుపతి, సంతోష్, గంగాధర్, సాయి, సెంథిల్, రాణి, మమత, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఏం చేశారని సంబురాలు ?

- కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేష్

నవతెలంగాణ-ఆర్మూర్


మాట్లాడుతున్న కోల వెంకటేష్

రైతులకు ఏం చేశారని సంబురాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేష్ ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు దినోత్సవంపై కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే రైతు దినోత్సవం జరుపుతున్నారని, అసలు ఏం అర్హత ఉందని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ చేసినందుకా, 2018 ఎన్నికల్లో ఉచిత ఎరువులు ఇస్తామని అన్న హామీ నేర వేర్చినందుకా, ధరణితో రైతులను ముప్పతిప్పలు పెడుతూ వారిని తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరుగుతూ వారి భూమిపై వారికే హక్కు లేకుండా చేసినందుకా అని ప్రశ్నించారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతం అయినా నియోజకవర్గంలో కొత్తగా ఒక్క ఎత్తిపోతల పథకం కూడా పూర్తి చేయలేదని, పాత వాటికి మరమ్మతులకు నిధులు ఇవ్వడం లేదన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చెయ్యలేదని అన్నారు. రైతులకు పంటలకు మద్దతు ధర కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తే వారిపై కేసులు పెట్టి జైల్లో పెట్టిన చరిత్ర బీఆర్ఎస్‌దని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మీర్ మాజీద్, రవికాంత్‌రెడ్డి, మందుల పోశెట్టి, బట్టు శంకర్, హబీబ్, మీసాల రవి, బాలకిషన్, పెద్ద పోశెట్టి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-వేల్పూర్


వేడుకల్లో పాల్గొన్న నాయకులు

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వేల్పూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నర్సారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి పాల్గొని ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ వందలాది మంది యువకుల బలిదానాల వల్ల, సోనియా గాంధీ తెగింపు వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఏ లక్ష్యం కోసమైతే తెలంగాణ ప్రజలు తొలి, మలి దశ ఉద్యమాలు చేశారో ఆ ఆశయాలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మిగులు నిధులతో ఉన్న తెలంగాణ రాష్ట్రం అప్పుల పాలైందని, ఇది తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు మంచిది కాదని, రాష్ట్రాన్ని అమ్మే విధంగా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాడని, నిరుద్యోగం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏ లక్ష్యం కోసమైతే సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారో, వందలాది మంది యువకులు అమర వీరులయ్యారో వారి ఆశయాలను నెరవేర్చే విధంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతుందని అన్నారు. కార్యక్రమంలో దామోదర్‌గౌడ్, రమణ, రాజేందర్, రేవంత్‌రెడ్డి, ట్రాక్టర్ జంగన్న, మల్లేష్, స్వరూప, రాము, ప్రవీణ్, రవి, నరేష్, వినోద్, భీంగల్ మండలాధ్యక్షులు స్వామి, నాగేంద్ర, అనంతరావు, కల్పన, నరసయ్య, ఇంద్ర గౌడ్, మోహన్, నరేష్ పాల్గొన్నారు.

పోలీస్ ఆఫీసర్లకు శిక్షణా తరగతులు

నవతెలంగాణ-కంఠేశ్వర్


శిక్షణలో పాల్గొన్న పోలీసు ఆఫీసర్లు

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.వైజయంతి, నిజామాబాద్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీనర్సయ్య ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాసదన్ హాలులో నిజామాబాద్ డివిజన్‌లోని పోలీసు అధికారులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రహీమొద్దీన్ శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో ఎఫ్ఐఆర్ నుంచి చార్జ్‌షీట్‌లో జరుగుతున్న లోపాలు, ఏ రకమైన ఆధారాలు సేకరించాలో, పీఓసీఎస్ఓ చట్టం గురించి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, మొదటి ఏడీజే కనకదుర్గ, రెండవ ఏడీఎం గోపికృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీనర్సయ్య వివిధ అంశాలపై కూలంకశంగా వివరించారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్


చెక్కులను పంపిణీ చేస్తున్న సర్పంచ్

మండల కేంద్రంలో సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ అధ్యక్షతన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన ఇద్దరికీ రూ.14 వేల చొప్పున మొత్తం 28 వేల రూపాయల చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వారు స్థానిక ఎమ్మెల్యే షకీల్ ఆమీర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ధనుంజయ, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు అంజయ్య, డైరెక్టర్ ఆఘు నారాయణ, తిరుపతి రాము, వేణు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


ప్రదానం చేసిన బహుమతులతో విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వివిధ గురుకులాలకు ఎంపికైన సందర్భంగా శనివారం ఉదయం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. 33 మంది విద్యార్థులకు గాను 25 మంది పాఠశాల విద్యార్థులు వివిధ గురుకుల పాఠశాలలలో సీట్లు పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ తెలిపారు. అనంతరం సర్పంచ్ జక్క మల్లుబాయి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో పాఠశాల విద్యార్థులు మరిన్ని ఉన్నత చదువులను అభ్యసిస్తూ పుట్టిన ఊరికి, కన్న తల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతులు తేవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్క మల్లుబాయి, ఉప సర్పంచ్ జక్క గంగాధర్, ఎస్ఎంసీ చైర్మన్ పిప్పెర గణేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబారు లక్ష్మీ నారాయణ, గ్రామస్తులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

- ఎస్ఐ భాస్కరా చారీ

నవతెలంగాణ-ముప్కాల్

ఈ నెల 10న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ముప్కాల్ ఎస్ఐ భాస్కరచారి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. తగాదాలుంటే ఆ కేసులను రాజీచేసే విధంగా కోర్టులో పరిష్కరించుకోవడానికి అవకాశం ఉందని సూచించారు. కావున ఈ అవకాశాన్ని ఇరువర్గాలకు సంబంధించిన వారు గ్రహించి సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.